నుండి వచ్చే కాంతి, శాంతి అంతా వెదజల్లబడుతుంది. వాడు నిస్సంకల్ప స్థితిలో ఉంటాడు. వీళ్లను ఉద్ధరించాలి లేకపోతే వాళ్లకు సహకరించాలి అని ఆయన ఏమీ అనుకోడు. ఆయనకు సంకల్పం లేదు. ఆయన సంకల్పంతో సంబంధం లేకుండా మీరు పొందవలసింది ఏదో మీరు పొందుతారు. జ్ఞాని సమక్షంలో విషయాన్ని గ్రహించినట్లు మీరు పుస్తకాలు చదవటం వలన, ఉపన్యాసాల వలన గ్రహించలేరు. జ్ఞాని సమక్షంలో మీ లోపల ఉన్న సత్యం మీకు ఎరుకలోనికి రావటానికి సహాయం అందుతూ ఉంటుంది, లోపలఉన్న సత్యవస్తువు మీకు ఎరుకలోనికి వచ్చే అవకాశం ఉంది. గురువు మీకు శాంతిని, జ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు, వాటి సహాయంతో మీకు స్వరూపజ్ఞానం కలుగుతుంది. గురువు యొక్క చూపు నీ హృదయాన్ని తాకుతూ ఉంటే, గురువు నిన్ను అనుగ్రహిస్తూ ఉంటే అప్పుడు నీకు జ్ఞానోదయం అవుతుంది. ఇంక నీకు మాటలు కాని, రచనలుకాని ఏమీ అవసరం లేదు. జ్ఞాని యొక్క సమక్షం నీలో పరివర్తన తీసుకొని వస్తుంది. ఆయన చూపు వల్ల నీకు జిజ్ఞాస కలుగుతుంది. ముముక్షత్వం కలుగుతుంది. హెూలీ కంపెనీ వలన మీరు చీకటిలోనుండి వెలుతురులోనికి వెళతారు. మీకు స్వరూపజ్ఞానం కలిగాక అంతకుమించిన సత్యం లేదని మీకు అనుభవంలోనికి వస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-01-2016, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇతరులు మనల్ని మోహపెడుతున్నారని ప్రతీమనిషి అనుకొంటాడు. ఎవరో నిన్ను మోహపెట్టటం లేదు. నీ దేహమే నిన్ను మోహపెడుతోంది. మీరు ఇంటికి వెళ్ళి ఏకాంతంగా కూర్చొని పరిశీలన చేసుకోండి. మనస్సులోకి ఏవో వస్తూ ఉంటాయి. నీకు ఏకోరిక వచ్చినా, ఏ తలంపు వచ్చినా, ఏది వచ్చినా దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని వస్తున్నాయి. దేహము నేను అనే తలంపు ఉంది కదా అందులోనుండే ఈ దుమ్ము అంతా వస్తోంది. ఎవరో ఎవరినో మాయ చేస్తున్నారు అని అనుకోవద్దు. నీ శరీరమే నిన్ను భ్రాంతిలో పెడుతోంది. మీకు ఉన్న ధనాన్ని బట్టి గాని, చదువును బట్టిగాని, గౌరవాన్ని బట్టి గాని దేహానికి సంబంధించిన భ్రాంతిలోనుండి బయటకు రాలేవు. ఏదో డివైన్ ఇంటర్ఫియరెన్స్ లేకుండా ఈ భ్రాంతిలో నుండి బయటకు రాలేము. నీ శరీరమే నీ భ్రాంతికి కారణం. ఈ దేహాన్ని పంచభూతాలతో తయారుచేస్తారు. పంచభూతాలు కలిస్తే శరీరం పుడుతుంది, పంచభూతాలు విడిపోతే ఆ శరీరం చనిపోతుంది.

ఆచార్యులవారు ఏమన్నారు అంటే సముద్రంలో ఉన్న మొసళ్ళు ఎటువంటివో నీ

కోరికలు కూడా అటువంటివే. సముద్రాన్ని ఈదగల శక్తి నీకు ఉన్నా నీకు ఎన్నో మొసళ్ళు అడ్డువస్తాయి. అలాగే ఈ ప్రకృతిని జయించాలి అని నువ్వు అనుకొన్నా అది అంత తేలిక కాదు. ఈ ప్రకృతి అనే సముద్రాన్ని ఓవర్‌కమ్ చేయాలి అనుకొన్నప్పడు కోరికలు అనే మొసళ్ళు నీకు అడ్డువస్తాయి. ఒక్కో కోరిక ఓక్కో మొసలి అయితే వాటిని నువ్వు చంపలేవు. వైరాగ్యం ఉన్నవాడు మాత్రమే ఆ మొసళ్ళను చంపగలడు. వైరాగ్యం లేకుండా నువ్వు కోరికలను తొలగించలేవు. అందుచేత వైరాగ్యాన్ని ప్రాక్టీసు చెయ్యి. ఆధ్యాత్మిక జీవితంలో వివేకం, వైరాగ్యం ఇవి రెండూ చాలా ముఖ్యం. అయితే ఈ ప్రకృతి అనే సముద్రాన్ని ఓవర్‌కమ్ చేయటానికి నీకు కైండ్ టీచర్ అవసరం. ఎవరయితే సబ్జక్టు వింటున్నారో వారిపట్ల టీచర్ బహు దయ కలిగి ఉండాలి. టీచర్‌కు ఎక్స్‌ప్లెయిన్ చేసే శక్తి లేనప్పడు, ఆయనకు నీ పట్ల దయ లేనప్పడు చెప్పినా ప్రయోజనం ఏమీ ఉండదు. ఇది ఏదో యాంత్రికంగా చెపితే వచ్చేది కాదు.

మీకు శాంతి వస్తుంది, సుఖం వస్తుంది కానీ వాటికోసం ఎదురుచూడకండి. మీ మార్గంలో మీరు ప్రయాణం చేయండి. మీ మనస్సు ఎప్పడయితే ముగ్గిందో భగవంతుడు చూసుకొంటాడు, మీకు ఇవ్వవలసింది ఇస్తాడు. జ్ఞానమే కాదు ఏదయినా సరే మనకు ఎంతవరకు అర్హత ఉందో అంతవరకు వస్తుంది. శాస్త్రం పట్ల గౌరవం విడిచి పెట్టవద్దు. మీ నిదానంలో మీరు ఉంటూ మీరు చెయ్యగలిగిన సాధన ఏదో మీరు చేసుకొంటూ పోతే మీరు గమ్యానికి చేరుకొంటారు. ఎప్పడో రాబోయే జన్మలో కాదు ఈ జన్మలోనే మీరు పొందవలసింది ఏదో పొందుతారు. సందేహం ఏమీ అక్కరలేదు. జీవుడికి అసాధ్యం ఉంది కాని ఈశ్వరుడికి అసాధ్యం అనేది ఏమీ లేదు. ఈశ్వరుని దయ ఉంటే అంతా సాధ్యమే. మనకి జ్ఞానం వస్తుందా, రాదా అని అలా అనుకోవద్దు. అలా అనుకోవటం వలన కూడా అదే మీకు అడ్డువస్తుంది. ఏ విషయాలలో అయితే మీరు బంధింపబడ్డారో, ఏ యింద్రియాన్ని ఏ విషయం అయితే ఆకర్షిస్తోందో దానిని తెంపుకొని బయట పడటం కొంచెం కష్టసాధ్యం. దానికి స్వప్రయత్నం ఉండాలి, కాలపరిపక్వం ఉండాలి, ఈశ్వరకటాక్షం ఉండాలి. మీరు ఎందులో నుండి అయితే విడుదలపొందుదామని అనుకొంటున్నారో అందులో ఉన్న నిస్సారత మీకు తెలియాలి. అందులో ఏమీ సారం లేదని మీ మనస్సుకు అర్థమయితే అది బ్రేక్ అవుతుంది. కత్తి అంచుమీద నడిచేవాడు ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఆధ్యాత్మికజీవితంలో అంత జాగ్రత్తగా ఉండాలి. నువ్వు దేనినయితే పొందాలి అనుకొంటున్నావో దాని గురించి స్మరించాలి, దానినే ధ్యానించాలి, దాని గురించి తపించాలి.

విషం కంటే విషయచింతన చాలా ప్రమాదం. విషం ఆ శరీరాన్నే చంపుతుంది కాని విషయచింతన నీకు బహుజన్మలను తీసుకొనివస్తుంది. అందుచేత విషయచింతన నుండి విడుదలపొందటానికి ప్రయత్నం చెయ్యి. అలా ప్రయత్నం చేసేవాడే తెలివైనవాడు. లోకంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. ఇందులో ఏ ఆకర్షణకు గురి అయినా మనిషి పతనమవుతాడు. ప్రాపంచిక విషయముల పట్ల నీకు ఎక్కువ ఆకర్షణ కలుగుతోంది అనుకో, నీ బుద్ధి క్రమంగా లేదు అని అర్థం. విషయచింతన వలన నీ బుద్ధి పాడవుతుంది నీ బుద్ధి వక్రంగా ఉంది అనుకో దానిని నిదానం చేసుకో. నీ బుద్ధిని బాగుచేసుకో. మీకు జిజ్ఞాస ఉందా మీకు జ్ఞానం సంపాదించాలనే కోరిక నిజంగా ఉందా అయితే పాములు కనబడిన్పడు మనం వాటి దగ్గరకు వెళ్ళము, దూరంగా ఉండగానే ప్రక్కకు తప్పకొంటాము అలాగే నువ్వు ప్రమాదకర విషయాలకు దూరంగా ఉండి వాటి నుండి తప్పించుకొనిపో. మనవాళ్ళు మోక్షం అంటారు, బౌద్ధులు నిర్వాణస్థితి అంటారు, క్రైస్తవులు స్వర్గరాజ్యం అంటారు. ఇదంతా మన హృదయంలోనే ఉంది హృదయంలో ఎక్కడ ఉంది అని భ గవాన్‌ను అడిగితే అది ఎక్కడ ఉందో నేను చెపితే నీకు తెలిసేది కాదు, నువ్వు అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఒకవేళ గురువు దయవలన ఎప్పడయినా అది నీకు స్ఫురించినా, అది సొంతం అవ్వటానికి నువ్వు ప్రయత్నం చేసుకోవాలి.

మామూలుగా మనిషిలో ఉన్న బలహీనత ఏమిటి అంటే జీవుడిని అలంకరించు కొంటూ ఉంటాడు. మనం జీవలక్షణాలను తగ్గించుకోవాలి కాని జీవుడిని అలంకరించుకో కూడదు. వ్యక్తిభావన విడిచిపెట్టడం కష్టం. కొంతమందికి అసలు ఇంఫేర్సనల్ లైఫ్ ఉండదు. ఇంఫెర్సనల్‌లైఫ్ రాకుండా మీకు రీలైజేషన్ రాదు. మమ్మల్ని అనుగ్రహించాలి అని భగవాన్‌ను ఎవరయినా అడిగితే మరి నన్నెవరు అనుగ్రహించారు. నన్ను అనుగ్రహించేవాడు వేరు, మిమ్మల్ని అనుగ్రహించేవాడు వేరుకాదు. ఎవడయితే నన్ను అనుగ్రహించాడో వాడే మిమ్మల్ని కూడా అనుగ్రహిస్తాడు. ఉన్నది ఒక్కటే, ఈశ్వరుడు ఒక్కడే, ఆయనే అందరినీ అనుగ్రహిస్తాడు. మనస్సు, శరీరము ఈ రెండు బంధాల్లోంచి విడుదల అవ్వకుండా ఎవడికీ జ్ఞానం వచ్చే అవకాశం లేదు. ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే నేను చెప్పటం మీకు చెపుతున్నాను. నేను చెప్పే సబ్జక్టు మీకు ఎంతవరకు ఉపయోగపడుతుంది అని మీరు సొంతంగా ఆలోచించుకోండి. ఏదో నేను చెప్పానని చెప్పటం కాదు. మీరు ఆలోచించుకొని సొంతం చేసుకొంటే అది నిలబడుతుంది, కానీ నేను చెప్పానని మీరు భుజాన వేసుకొంటే అది నిలబడదు. అది మీరే నిర్ణయించుకోవాలి. నేను చెప్పిన దానిలో ఏమయినా సారం ఉంటే

తీసుకోండి, సారం లేకపోతే వదిలేయండి అని చెప్పారు.

మీరు పతనమయిపోవటానికి ఒక్క యింద్రియం చాలు. అన్ని యింద్రియాలు కలిస్తే ఇంక చెప్పనక్కరలేదు. ఒకో యింద్రియానికి ఒకో విషయం ఉంటుంది, అవి పూర్వజన్మల నుండి వస్తాయి. వాటిని అతిక్రమించటం చాలా కష్టం. కానీ మీ సాధన ఉపయోగించి, వివేకం ఉపయోగించి, శాస్త్రాన్ని ఉపయోగించుకొని, సత్సంగం ఉపయోగించుకొని, హెూలీ కంపెనీని ఉపయోగించుకొని, మీరు భగవంతుడు యిచ్చిన అన్ని అవకాశములను ఉపయోగించుకొని ఏ విషయాలయితే మిమ్మల్ని ఆకర్షిస్తున్నాయో వాటిలో నుండి మీరు కనుక విడుదలపొందితే వాడు మోక్షం పొందటానికి అర్హుడు అవుతాడు. మోక్షం అనేది ఈశ్వరుడి చేతిలో ఉంది. నువ్వు చెయ్యవలసిన పని చెయ్యాలి. లాస్ట్‌మినిట్‌లో డివైన్ యింటర్‌ఫియరెన్స్ ఉండాలి. హృదయశుద్ధి కలవారు ధన్యులు, వారు మాత్రమే దేవుని చూచెదరు అన్నాడు. ఇవి ఆలోచించి చెప్పిన మాటలు కాదు. వారి అనుభవం నుండి తీసి చెప్పిన మాటలు, వారి హృదయాంతరాళాల్లోంచి వచ్చిన మాటలు. అది జ్ఞాని యొక్క హృదయసారం, వాడి హృదయంలో నుండి వచ్చింది. అందుచేతనే వాక్యం దేవుడై ఉన్నది అని చెపుతారు. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. ఒకవేళ మీరు విషయాకర్షణల నుండి బయటకు రాలేదు అనుకోండి. మీరు ఎంత పండితులు అయినా, మీరు శాస్త్రాలను మదించిన మహామేధావులు అయినప్పటికీ మీకు శాంతిస్థానం సున్న, సుఖస్థానం సున్న. అందుచేతనే రామకృష్ణుడు పెద్దపెద్ద పండితులను కూడా పట్టించుకోలేదు.

మీరు అందరూ శాంతిస్థానం పొందుతారు, సుఖస్థానం పొందుతారు. అది సాధ్యమా అంటే ఈశ్వరుడికి అన్నీ సాధ్యమే. జైల్లో పెట్టినవాడే మరల జైలులో నుండి విడిచిపెట్టాలి. నీకు దేహబుద్ధిని ఎవడయితే కలుగజేసాడో వాడే తొలగిస్తాడు. ఊరికే వాడిపట్ల విశ్వాసం కలిగి ఉంటేచాలు. వాడిపట్ల విశ్వాసం, గౌరవం కలిగి ఉండు. నీకు సుఖాలు వచ్చినా, కష్టాలు వచ్చినా వాడి అస్థిత్వం పట్ల నీకు సందేహం వద్దు. ఈశ్వరుడు ఉన్నాడా, లేడా అని సందేహం వద్దు. ఆయన పట్ల పూర్తి విశ్వాసం కలిగి ఉండు. ఆయన సంకల్పం పట్ల గౌరవం కలిగి ఉండాలి. నీ సంకల్పమే నెరవేరుగాక అనాలి. మీకు ఏది మంచిదో మీ కంటే ఈశ్వరుడికి ఎక్కువ తెలుసుకదా. ఏమో మీ జీవితాలను ఎప్పుడు మలుపు తిప్పతాడో, ఆయనను అంగీకరిస్తే సరిపోతుంది. ఇప్పుడు ఆయన సంకల్పం విషం కింద నీకు కనిపించవచ్చు. చివరకు అదే అమృతం అయిపోతుంది. నీ మంచి నీకంటే ఈశ్వరుడికి ఎక్కువ తెలుసు అనే గ్రహింపు

ముందుగా నీకు ఉండాలి. ఇక్కడ నమ్మకం కాదు, బ్రెయిన్‌లో క్లారిటీ ఉండాలి. కన్‌ఫ్యూజన్ వలన శాంతి రాదు, క్లారిటీ వలన నీకు శాంతి కలుగుతుంది.

టీచర్ దయ కలవాడయి ఉండాలి, వాడికి మంచితనం ఉండాలి, వివేకం ఉండాలి, మీ క్షేమం కోరుతూ ఉండాలి, ఆ వాక్యాన్ని ఎలా చెపితే అది మీ మనస్సుకు పడుతుందో ఆ విచక్షణ ఉండాలి, గురువు నీకు చెప్పటమే కాకుండా, ఆ చెప్పింది నీకుఅనుభవంలోనికి తీసుకొనిరావాలి. ఎన్నిసార్లు చెప్పాలి అంటే బట్టకు పట్టిన దుమ్ము పోయే వరకూ చాకలి ఆ బట్టను రాయి కేసి కొడుతూనే ఉంటాడు, అలాగే చెప్పేది నీ మెదడుకు పట్టేవరకూ సబ్జక్టు చెపుతూనే ఉండాలి, విసుగ్గా ఉండకూడదు, టీచరు ఏమాట అయితే చెపుతున్నాడో ఆ మాట తాలుకు అనుభవం వాడికి ఉండాలి, వాడు ఏ వాక్యం అయితే చెపుతున్నాడో ఆ వాక్యాన్ని ముందు వాడు ఎంజాయ్ చేసి అప్పడు మీకు చెప్పాలి. ఇవన్నీ టీచర్‌కు ఉండాలి. భగవాన్ దగ్గరకు ఎప్పడయినా పాములు వచ్చినా ఈయన దానివంక చూసేవారు, అది ఈయన వంక చూసేది. ఊరికే అలా చూసి వెళ్ళిపోయేవి కాని దగ్గరగా ఉన్నా కరిచేవి కాదు. వీడు మనకు శత్రువు కాదు, వీడు మనకు ఏమీ అపకారం చేయ్యడు అనుకొన్నప్పడు యింక అది కరవదు, దానికి భయం వేసినప్పడు కరుస్తుంది. అలాగే చిరుతపులులు వచ్చేవి. మీరు ఇక్కడకు రాకూడదు, మీరు వస్తే అందరూ జడుస్తారు, మీరు వెళ్ళిపోండి అనేవారు భగవాన్. ఆయనకు భయం వేయలేదా అనే సమస్య వస్తుంది. మనం పులిదేహాన్ని చూస్తాము మన శరీరాన్ని అది చూస్తుంది. అప్పడు మనల్ని చూస్తే దానికి భయం, దానిని చూస్తే మనకు భయం వేస్తుంది, ఎందుచేతనంటే దేహాన్ని చూస్తున్నాము కాబట్టి భయం కలుగుతోంది. కాని అంతర్యామిగా ఉన్నవాడు నారాయణుడే. అవి కోపంగా ఉన్నప్పడు కూడా ఆయన దగ్గరకు వెళ్ళేటప్పటకి శాంతం అయిపోయేవి. అంటే శాంతి సామ్రాజ్యం దగ్గరకు వెళ్ళేటప్పటికి దానికి కూడా శాంతి కలుగుతుంది. కొండమీద ఎక్కడయినా పులులు కనబడినా దగ్గరగా నుంచునేవారు భగవాన్. అది అభయస్థితి. మోక్షానికి మరోపేరే అభయస్థితి. దేహబుద్ధి ఉన్నప్పడు అభయస్థితి రాదు. నీకు భయం వేస్తూ ఉంటే ఇంక మోక్షం ఏమిటి. భయం వేస్తూ ఉంటే దుఃఖం వచ్చేస్తుంది. నీకు ద్వితీయం కనిపిస్తే భయం. ఎక్కడ చూసినా నువ్వే కనిపించినప్పడు యింక నీకు భయం ఏమిటి? నీకు భయపడటానికి ఈ సృష్టిలో ఇంక ఏమీ లేదు. అంగుళీమాలుడు బుద్ధుడిని చంపడానికి వస్తాడు. బుద్ధుడు నిర్మలంగా నుంచున్నాడు. నువ్వు చెయ్యాలనుకొన్న పని చెయ్యి అన్నాడు బుద్ధుడు. అంగుళీమాలుడికి

చేతులు వంకరలు పోయాయి. ఆ వాతావరణంలోకి వచ్చేటప్పటికి వాడికి శాంతి వచ్చేసింది. శాంతి కలిగినప్పడు ఇంక మర్డర్స్ ఏమీ చేస్తాడు.

నీకు జీవితంలో ఏదో పాయింట్‌లో సంతృప్తి ఉండాలి. సంతృప్తి లేకపోవటం వలన చాలా మంది పాడైపోయిన వాళ్ళు ఉన్నారు. ఏ విషయంలోను కూడా ఇతరులతో పోల్చుకోవద్దు. ఎవరి పద్ధతి వాళ్ళదే. నీకు ఎవరయినా అపకారం చేస్తే అది మర్చిపోవటం ఉత్తమం. నీ ఆలోచనలో నిదానంగా ఉండు. ఎట్టి పరిస్థితులలోను నువ్వు శాంతిని పోగొట్టుకోవద్దు. శాంతి లేనివాడికి సుఖం లేదు. పరిస్థితులను ప్రారబ్దానికి విడిచిపెట్టండి. మీరు శాంతిగా ఉండండి. వాటి ప్రభావం మీ మీద పడనివ్వకండి. అప్పడు మీరు దైవానుగ్రహానికి పాత్రులవుతారు. నీ శాంతికి, సుఖానికి ప్రతీదానికి నీ దేహం మీద నువ్వు కనుక ఆధారపడుతూఉంటే చివరకు నువ్వు మరణదేవతకు లోబడి పోవలసిందే కాని నీకు మోక్షం లేదు, శాంతిలేదు. నీ దేహంతో సంబంధంలేకుండా, మనస్సుతో సంబంధంలేకుండా, సమాజంతో సంబంధంలేకుండా, ప్రకృతితో సంబంధంలేకుండా స్వతంత్రంగా నువ్వు శాంతిని పొందాలి. ఇతరులు నీ శాంతిని పాడుచేస్తూ ఉంటే వారిని రానివ్వవద్దు. మీకు ఇల్లు ఉంది, పొలం ఉంది, తరువాత శరీరం ఒకటి ఉందికదా. నాకు ఇల్లు ఉంది, ఒక ఎకరం పొలం ఉంది అని ఎలా అనుకొంటున్నారో అలాగే నాకు ఒక శారీరం ఉంది అనుకోండి కాని నేను శరీరాన్ని అనుకోవద్దు. ఆ శరీరం మీరు కాదు. అందుచేత ఎప్పడయినా దానితోటి విడిపోతారు. మీకు ఒక శరీరం ఉన్నమాట నిజమే. అది ఉన్నంతసేపు దానిని మెయిన్‌టైన్ చేసుకోండి కాని అది నువ్వు అనుకోవద్దు, ఈ శరీరంమే నేను అని అనుకోవద్దు.

తెలివితేటలు కొంచెం తక్కువ ఉన్నా ఫరవాలేదు కానీ పరాయిబుద్ధి కంటే సొంతబుద్ధి మంచిది. ఏదయినా విషయం వచ్చినప్పడు మనంతట మనం ఆలోచించుకోగలగాలి. మనకు ఏదయినా తెలియకపోతే మన క్షేమం కోరేవారిని సలహా అడుగవచ్చు. మనంతట మనం సొంతంగా కొంత ఆలోచించుకోవాలి. సొంతబుద్ధి సుఖాన్ని తీసుకొని వస్తుంది. పరాయి బుద్ధి ప్రమాదాన్ని తీసుకొని వస్తుంది. నువ్వు ఏదైనా సలహా అడిగినప్పడు నువ్వు ఏ పరిస్థితిలో ఉన్నావో అది ఆలోచించి వాళ్ళు నీకు సలహా చెప్పాలి, అది ఆలోచించకుండా వారి నోటికి వచ్చినట్లు చెప్పేస్తే నువ్వు యిబ్బంది పడతావు. నీ స్థానంలో ఉండి వాళ్ళు చెప్పాలి. నువ్వు సలహా అడిగిన వాళ్ళు ఎంతవరకు నీ క్షేమం కోరుతున్నారో అది కూడా నువ్వు చూసుకోవాలి. మాకు తెలివితేటలు లేవు అనుకోవద్దు, సమాజాన్ని చూసి నేర్చుకోవాలి. సమాజమే కాదు ఇంట్లో వారు ఏదయినా

చెప్పినా అది కూడా నువ్వు సొంతంగా ఆలోచించుకోవాలి. మెదడు అనేది మనకు ఆలోచించుకోవటానికే ఇచ్చాడు. మనం దానిని సోమరితనంగా ఉంచకూడదు. మీరు ఏదయినా చదివేటప్పుడు కూడా ఇది మనకు ఎంత వరకు ఉపయోగపడుతుంది అని సొంతంగా ఆలోచించుకొని నిర్ణయించుకొంటే అది మీ సొంతం అవుతుంది కాని నేను చెప్పిన దానిని భుజాన వేసుకొని తిరిగితే అది మీ సొంతం అవ్వదు అని ఆచార్యులవారు చెప్పారు.

ఒక మొసలిని దుంగ అనుకొని దానిని పట్టుకొని ఆ మొసలిద్వారా నదిని దాటుదామనుకోవటం ఎటువంటిదో నువ్వు నూటికి నూరుపాళ్ళు దేహాన్ని నమ్ముకొని, నీ దేహమే సర్వస్వం అనుకొంటూ దేహబుద్ధితో మోక్షాన్ని పొందుదామనుకోవటం కూడా అటువంటిదే. ఇందులో అంత ప్రమాదం ఉంది. దేహం మరణించకముందే దేహబుద్ధి మరణించాలి. దేహము మరణించకముందే దేహం పట్ల నేను అనే బుద్ధి మరణించాలి. అప్పుడు వాడికి జ్ఞానం కలుగుతుంది. పాలకొల్లులో ఒకరు వాళ్ళ అపార్ట్‌మెంట్‌కు నాన్నగారు అపార్ట్‌మెంట్ అని వ్రాసుకొన్నారు. అప్పుడు వాళ్ళతో ఏమని చెప్పాను అంటే ఇప్పుడు నేను ఈ పేరు చదువుతున్నాను కదా దానివలన నాకు ప్లెజర్ వచ్చింది అనుకోండి, ఇంకనాకు జ్ఞానం లేదు. ఈ పేరు చదవకముందు ఎలా ఉన్నానో పేరు చదివాక కూడా అలాగే ఉండాలి. నా మనస్సులో ఏదయినా వికారం వచ్చింది అనుకోండి ఇంక నాకు సాధన లేనట్లే అని చెప్పాను. అసలు మనకు జ్ఞానం రాకపోవటానికి ఈ రూపము, నామము ఇవి రెండే మనకు అడ్డు, ఇతరులు ఎవరూ కాదు. ఈ విషయాలు మీరు క్లోజ్‌గా అబ్జర్వ్ చేసుకోవాలి.

ప్రపంచాన్ని చూసి నీకు ఏదైనా భ్రాంతి కలుగుతూ ఉంటే దానికి ఎవరో కారణం కాదు, నీ శరీరమే ఆ భ్రాంతికి కారణం. దేహంపట్ల నీకు ఉన్న భ్రాంతిని కనుక జయించగలిగితే నువ్వు ఈ జన్మలోనే, ఈ లోకంలో ఉండగానే శాశ్వతశాంతిని, శాశ్వతసుఖాన్ని పొందుతావు. నీకు దేహభ్రాంతి ఉండటం వల్లే మాయ అంత బలంగా వుంది. దేహం పట్ల నీకు ఉన్న భ్రాంతి చావుతో సమానము. ఈ దేహము నువ్వా? దేహము నువ్వు కాదు. నువ్వే అనే భ్రాంతి ఉంది కదా, అది చావుతో సమానము. మీ కుటుంబసభ్యులు అందరూ దేహానికి సంబంధించినవారే కదా! నీ దేహం ఎటువంటిదో వారు కూడా అటువంటివాళ్ళే. నీ దేహం నీకు ఎలా శత్రువో వాళ్ళు కూడా అంతే. ఊరికే అలా మిత్రులు కింద అనిపించినా వాళ్ళు నీకు శత్రువులే. నీ దేహాన్ని బట్టి వాళ్ళు వచ్చారు కదా! ఈ దేహబుద్ధిని, దేహం పట్ల అభిమానాన్ని ఎవడైతే వదులుకొన్నాడో వాడు మాత్రమే విష్ణుస్థానాన్ని పొందుతాడు. దేహబుద్ధి పోయినవాడికి

చైతన్యబుద్ధి కలుగుతుంది. వాడు మాత్రమే చైతన్యస్థానాన్ని అంటే విష్ణుస్థానాన్ని పొందుతాడు. అంటే అంతటా వ్యాపించినటువంటి పరమాత్మను పొందుతాడు. శరీరం పుడుతుంది, పెరుగుతుంది, కొంత వయస్సు వచ్చాక క్షీణించటం ప్రారంభించి చివరకు చనిపోతుంది. ఈ గొడవలు అన్నీ దేహానికి సంబంధించినవి. దీనికి రంగు ఒకటి, కులం ఒకటి ఉంటుంది. దీనికి గౌరవం కావాలి. గౌరవం వస్తే సంతోషిస్తుంది, అగౌరవం వస్తే బాధపడుతుంది. ఇవి అన్నీ పనికిరాని గొడవలు. ఇల్లు తుడిచి ఆ దుమ్మును ఎలా బయటపడేస్తామో అలాగ ఈ గొడవలన్నింటిని బయటపడేయండి. ఇవి అన్నీ శవం గొడవలే లోపల ఉన్న చైతన్యానికి ఏమీ లేవు. దేహం ఉన్నవాడికి లోకం. దేహం లేనివాడికి లోకం ఎక్కడ ఉంది? లోకమే లేనప్పుడు ఇంక దేవుడు ఏమిటి? బుద్ధుడు ఏమి చెప్పాడు అంటే దేవుడు ఉన్నాడా, లేడా అనే గొడవ వద్దు, నువ్వు వాసనాక్షయానికి ప్రయత్నం చేసుకో. నీకు సుఖం కావాలి, శాంతి కావాలి అంటే వాసనాక్షయం చేసుకో సరిపోతుంది అని చెప్పాడు.

గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఎక్కడ చెయ్యి పెడితే అక్కడ మంచినీరు దొరికే వాడికి ఇంక నీటికోసం నూతులదగ్గరకు, చెరువుల దగ్గరకు, నదుల దగ్గరకు వెళ్ళవలసిన పని లేదు అలాగే నువ్వు అంతటా హేపీనెస్ పొందుతున్నపుడు ఇంక హేపీనెస్ కోసం ఎక్కడికి వెళతావు. అంతటా హేపీనెస్ అనుభవంలోనికి వచ్చినవాడికి ఇంక ఇంద్రియాలతోటి, విషయాలతోటి పని ఏముంది? ఈ గొడవ అంతా ఎందుకు? దేహము, ఇంద్రియాలు, విషయాలు ఈ బుద్ధి నీకు పోయినప్పుడే నీ నిజమైన స్వభావం ఏదో నీకు తెలుస్తుంది. అంటే ఈ ప్రకృతి అనే అడివి దాటినప్పుడు మనం ఏదిగా ఉన్నామో దాని తాలుక అనుభవం మనకు వస్తుంది. కాశీ, రామేశ్వరం ఇలా చాలా పుణ్యక్షేత్రాలు ఉన్నాయి కదా మీరు ఈ అరుణాచలం విడిచిపెట్టి ఎక్కడికి వెళ్ళరేమిటి అని భగవాన్‌ను అడిగితే ఆయన ఒకమాట చెప్పారు. ఎక్కడికి వెళ్ళినా నన్ను నేనే చూసుకొంటాను ఇంక ఎక్కడికి వెళతాము? మరి మీరు కొండవంక చూస్తున్నారు కదా! అలాగే కాశీ చూడవచ్చు కదా అని అడిగారు. నేను కొండవంక చూడటం ఏమిటి? నన్ను నేనే చూసుకుంటున్నాను. నన్ను నేనే చూసుకొనేటప్పుడు ఇంక ఎక్కడికో వెళ్ళటం ఏమిటి? ఆయన చెప్పింది సత్యమే కాని అది మనకు అందని విషయం.

మీరు అనుకొన్నది జరిగితే ఒకరకంగా ఉంటారు, అనుకొన్నది జరగకపోతే ఇంకో రకంగా ఉంటారు. అది అందరూ చేసే పనే కదా! మీరు కూడా అలాగే ఉంటే ఇంక మీరు

భక్తులు ఎలా అవుతారు? అనుకొన్నది జరిగినప్పుడు సంతోషంగా ఉంటున్నారు. అనుకొన్నది జరగకపోతే మీకు దుఃఖం వస్తోంది. అనుకొన్నది జరిగినపుడు మీరు ఎలా ఉంటున్నారో, జరగనప్పుడు కూడా అలా ఉండగలిగితే మీరు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. మీకు ఇష్టం లేని సంఘటనలు జరిగినప్పుడు కూడా మీరు శాంతిగా ఉండగలిగితే, పరిస్థితులు ఎలా ఉన్నా ఈ జీవుడు ఆనందంగా ఉంటున్నాడు అని మనలో ఉన్న అంతర్యామి గుర్తించి ఆయన మనలను అనుగ్రహిస్తాడు. సాధన అంటే గుంజీలు తీయటంకాదు, గుడులు చుట్టూ తిరగటంకాదు. మీరు అనుకొన్నవి అన్నీ జరిగినప్పుడు బాగానే ఉంటున్నారు మీకు ఇష్టం లేనివి జరిగినప్పుడు బాగా ఉండటంలేదు, అప్పుడు కూడా బాగా ఉండటానికి ప్రయత్నం చేయాలి. అదీ సాధన అంటే.

మనం మాట్లాడే మాటలో, మనం చేసే పనిలో మన అహంకారానికి ఫుడ్ సప్లయి చేయకూడదు, సబ్జక్టు మాట్లాడాలి కాని మన అహంకారం దీనివలన సంతోషిస్తుంది అని అలా మాట్లాడకూడదు. ప్రతీ మనిషి వాడి అహంకారాన్ని సంతృప్తి పరచటానికే పనిచేస్తాడు, ఈశ్వరుని దయకోసం చేయడు, ఈశ్వరార్పణంగా పనిచేయడు. మన మనస్సుకు ఇష్టంవున్నా, ఇష్టంలేకపోయినా అది మంచిపని అనుకో ఆ పని చెయ్యాలి. మన అహంకారానికి ఇష్టమైనది చేయటం కాదు, అది మంచిపని అనుకొన్నపుడు, నలుగురికి ఉపయోగపడుతుంది అనుకొన్నప్పడు మన మనస్సుతో సంబంధం లేకుండా, వ్యక్తిభావనతో సంబంధం లేకుండా ఈశ్వరుడి ప్రీతికోసం ఆ పని చెయ్యాలి. అహంకారం కోసం నువ్వు పనిచెయ్యటం ఏమిటి? ఎవరైనా ఆత్మహత్య చేసుకొంటే ఎందుకు చేసుకొంటున్నాడు? వాడికి అహంకారం ఉంటుంది కదా! అహంకారాన్ని సంతృప్తి పరచటానికి ఆత్మహత్య చేసుకొంటున్నాడు. అంటే వాడి మనస్సును సంతృప్తిపరచటానికి చేసుకొంటున్నాడు. ఆ పని వాళ్ళకు సంతృప్తి ఇవ్వకపోతే వాడు చేసుకోడు కదా! మీరూ అలా చెయ్యటం ఏమిటి? వాళ్ళలాగే మీరు కూడా అహంకారాన్ని సంతృప్తి పరచటానికి పనులు చేస్తూ ఉంటే మీరు వాళ్ళతోటి సమానమే కదా! ఇందులో మీరు కాదనేది ఏముంది? ప్రాక్టికల్‌గానే చెపుతున్నాడు. ఆత్మహత్య బాధే కదా! అయినా ఎందుకు చేసుకొంటున్నాడు? వాడికి ఏదో సంతృప్తి కలుగుతోంది కాబట్టి చేసుకొంటున్నాడు. అవి మంచి పనులు కాకపోయినా, మీకు ఇష్టమైన పనులు చేస్తూ ఉంటే మీరు కూడా ఆత్మహత్య చేసుకొనే వారితో సమానమే. మీ ఇష్టం, అయిష్టం ఒక ప్రక్కన పెట్టండి. మీకు ఇష్టంలేక పోయినా అది మంచిపని అయితే చేయటం, అది మంచిపని కాకపోతే మీకు ఇష్టమైనా దానిని వదిలేయండి.

అది మంచి పనికాకపోయినా మీకు ఇష్టమైంది కాబట్టి ఆ పని మీరు చేస్తూ ఉంటే మీకు, ఆత్మహత్య చేసుకొనేవారికి తేడా ఏమీ లేదు. చనిపోవటం అనేది ఎవడికీ సరదా కాదుకదా! వాడికీ ఉండాలనే ఉంటుంది. కాని బతికి ఉండటంకంటే చనిపోవటం వలన మనం సుఖపడతాము అని అనుకోవటం వలన వాళ్ళు అలా చేస్తున్నారు. నీ కోణంలో నువ్వు ఆలోచించవద్దు. ఎవడైతే చనిపోయాడో వాడి కోణంలో నువ్వు ఆలోచించాలి అంతే కాని నీ కోణంలో ఆలోచిస్తే సబ్జక్టు నీకు అర్థంకాదు. ఆత్మహత్యల గురించి ఆచార్యులవారు బాగా చెప్పారు. ఆత్మహత్య అనేది మంచిపనికాదు, అది చెడ్డపనే. కాని వాడు ఎందుకు చేసుకొంటున్నాడు అంటే వాడి సంతోషంకోసం, వాడి మనస్సును తృప్తి పరచటంకోసం చేస్తున్నాడు అలాగే మీరు కూడా మీ సంతోషం కోసం చెడ్డపనులు చేస్తే ఎలాగ? ఇంక ఆత్మహత్య చేసుకొనేవారికి, మీకు తేడా ఏముంది? ఇద్దరూ సమానమే కదా అంటున్నారు ఆచార్యులవారు.

ఏదైనా సంఘటన జరిగితే కంగారుపడిపోవద్దు. వెయిట్ అండ్ వాచ్. ఆనందం నీ హృదయంలోనే ఉంది, సత్యం అనేది నీ హృదయంలోనే ఉంది, అరుణాచలం అనేది నీ హృదయంలోనే ఉంది. ఆ హృదయం ఎక్కడ ఉంది అని నువ్వు అడిగితే నేను చెప్పినా అది నీకు అర్థమవుతుందా? భగవద్గీత మీరు చదువుతున్నారు అనుకోండి అందులో ఏదైనా విషయం మీకు తెలియకపోతే మనకు అర్థమవ్వటంలేదు అనుకోవాలి. అంతేగాని భగవంతుడు చెప్పేది తప్పు అని అనుకోవద్దు. మనం ఇంకా అర్హత సంపాదించలేదు అనుకోవాలి. ఒకోసారి శబ్దానికి అర్థం తెలిసినా అది మన గుండెకు పట్టటంలేదు అనుకోండి, అది మన మెదడు గ్రహించటానికి మనలో ఏవో ఆటంకాలు ఉన్నాయి అని మనం చూసుకోవాలి కాని అక్కడ భగవంతుడు చెప్పింది పొరపాటు అని కాదు. ధనం, పాండిత్యం వీటిని మనం సద్వినియోగం చేసుకోకపోతే అవి మనలను పాడుచేస్తాయి. ధనం ఉందని నీకు గర్వం వస్తే నువ్వు శుభ్రంగా పాడైపోతావు. మీ మనస్సు అటు ఇటు తిరుగుతోంది అనుకోండి అరుణాచలం కొండ ఉంది కదా దానిని ధ్యానం చెయ్యండి. ఆ రూపాన్ని ధ్యానం చేయటం వలన మీ మనస్సు యొక్క వాండరింగ్ తగ్గిపోతుంది, నీకు స్థిరత్వం వస్తుంది. అలా చేసి చూడండి ఆ కొండ చంపక చంపెడు మందు. అంటే నీ దేహం చనిపోకుండా దేహబుద్ధిని చంపేస్తుంది. అది నీ దేహాన్ని చంపదు, దేహబుద్ధిని చంపుతుంది. అందుచేత ఆ కొండ చంపక చంపెడి మందు. భగవాన్‌కు ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఏదైనా ఆయనకు కొంచెం ఇష్టం ఉంది అంటే ఆ కొండే. అది శాంతిమలై అంటే శాంతిని ప్రసాదించే కొండ.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# గురుపూర్ణిమ

గురువు అంటే మనలో అంతర్యామిగా ఉన్న స్వరూప చైతన్యంలోకి మేల్కొలిపేవాడని అర్థం. ఏపని చెయ్యాలన్నా ముందుగా గురుస్తుతి, గురుధ్యానం చెయ్యడం అన్నది సాంప్రదాయంగా వస్తోంది. గు అంటే చీకటి, రు అంటే వెలుతురు. చీకటి అజ్ఞానానికి గుర్తు, వెలుతురు జ్ఞానానికి గుర్తు. కావున చీకటి వంటి అజ్ఞానాన్ని పోగొట్టి, జ్ఞానజ్యోతిని వెలిగించే వారే గురువు. అనాదిగా గురు శిష్య సంబంధం పవిత్రంగా భావింపబడుతోంది. ప్రతి సంవత్సరం ఆషాఢ పూర్ణిమను గురుపూర్ణిమగా, వ్యాసపూర్ణిమగా జరుపుకోవడం అనాదిగా వస్తోంది. లోకానికి గురువైన వ్యాసభగవానుడు జన్మించిన పుణ్యదినం. ఆరోజున తమ గురువులను పూజించడంలోని ఆంతర్యం గురువును వేదవ్యాసుని స్వరూపంగా భావించడమే! శ్రీ మహావిష్ణువే వేదవ్యాసుడిగా అవతరించాడని చెబుతారు, అందుకే ఆయన వ్యాసభగవానుడయ్యాడు. వేదాలను విభజించి వేదవ్యాసుడయ్యాడు. బ్రహ్మసూత్రాలు, పురాణాలు, పంచమవేదంగా భావించబడే మహాభారతము, భాగవతము మున్నగునవి రచించి మానవాళికి అందించారు. మహాభారతములోని అంతర్భాగమే భగవద్గీత. గురువు జ్ఞానప్రదాత మానవునికి వాస్తవంగా తాను ఎవరో? అనుభవైకవేద్యం కావాలంటే గురువు అనుగ్రహంకావాలి. విషయచింతన చేసే మనస్సును పరమాత్మ మీదకు మళ్ళించి, పరమాత్మను ఆరాధిస్తూ, ఆయనకు ఇష్టమైన పనులు చేస్తూ, ఆయన కోసమే జీవిస్తూ ఉంటే, అప్పుడు ఆ పరమాత్మే గురురూపం ధరించి వస్తుంది. అనగా మనకు అవసరమైనప్పుడు హృదయంలో ఉన్న సత్యవస్తువే గురురూపం ధరించి వస్తుంది. జన్మనిచ్చేవాడు తండ్రి అయితే, తిరిగి జన్మ లేకుండా చేసేవాడు గురువు. గురువు అంటే గుర్తు చూపేవాడు. మనము దేహాత్మబుద్ధిని అతిక్రమించడానికి గురుకటాక్షం అత్యంత ఆవశ్యకం. నిరంతరం మనకు గురువు అందించే సహాయ, సహకారాలకు కృతజ్ఞత తెలియచేయడానికి, గురువును స్మరించుకొని వారి సందేశమును మననము చేసి తద్వారా తాను ఎవరో? అనుభవైకవేద్యం చేసుకొని, గురుఋణం తీర్చుకోవడానికే గురుపూర్ణిమ ఏర్పాటు చేయడమైనది.

**(దిll 19-07-2016 గురుపూర్ణిమ సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# సత్యానుభవం పొందినవాడే సద్గురువు - ఆయనే శిష్యులకు కల్పవృక్షం

సత్కార్యాలవల్ల ఉత్తమ జన్మలభిస్తుంది. కాని ముక్తి సద్గురువు అనుగ్రహంవల్ల మాత్రమే లభిస్తుంది. సత్కర్మవల్ల చిత్తశుద్ధి లభిస్తుంది. అది సత్యానుభవానికి సహకరిస్తుంది. జ్ఞానానికి మించిన సంపద లేనేలేదు. విజ్ఞుడు అయినవాడు ముందుగా బుద్ధికి అతీతమైన సచ్చిదానందమయమైన సద్గురువును స్మరించుకొని ఆయన చెప్పిన మార్గంలో సాధనలో మునిగిపోవాలి. మనం ఎక్కడ ఉన్నా ఆ సచ్చిదానంద పరబ్రహ్మను నిరంతరం ధ్యానిస్తూ ఉంటే పురుగు తుమ్మెద అయినట్లు అనగా భ్రమరకీటక న్యాయంలా సాధకుడు తానే సచ్చిదానంద బ్రహ్మమౌతాడు. గురువును భావనచెయ్యగా చెయ్యగా మనలో ఏభావన లేని స్థితికి వస్తాము అంతదాకా భావన చెయ్యాలి. అది భావనకు పరమావధి ఆ స్థితిలో భావించటానికి ఏమీ ఉండదు. అంటే ఒకటైనది అన్నమాట. మనస్సు ఆ భావములోనే భాగ్యం పొందుతుంది. అది నోటితో చేసే ఉపదేశంకాదు అనుభవానికి చెందినస్థితి అంటారు అనుభవజ్ఞులు. పవిత్రమైన సదాచారంతో నీతినియమాలతోజీవితాన్ని గడుపుతూ ఉండటం పరమాత్మ ప్రాప్తికి అవసరమే. అందమైన నగిషీలతో గాజుపాత్రలు అన్నీ శుభ్రం చేసి మేజా బల్లపై అందంగా తీర్చిదిద్దితే ఆకలి ఏలా చల్లారుతుంది. మనకు సద్గురువు మార్గదర్శకత్వం లేకపోతే ఆ తీర్చిదిద్దిన గాజుపాత్రలో అమృతంలేని ఖాళీ పాత్రలే అవుతుంది. నియమాలే జీవితలక్ష్యం కాదు. మరణసమయంలో రోగాలతో సతమతమౌతున్నప్పడు కలిగే బాధవర్ణనాతీతం కాని ఒక సద్గురు పర్యవేక్షణలో ఉన్నప్పడు ఆనందపరవశుడై తన పెళ్లిరోజున కలిగే సంతోషం కన్న అమితసుఖాన్ని పొందుతాడు. ఆ సమయంలో గురువుమోహాన్ని తప్పించి మనోమాలిన్యాన్ని తొలగించి అన్ని వైపులనుంచి అంతర్ముఖం చేస్తాడు. మనం కొండకోనల్లో ఉన్నా కంటికి రెప్పలా కాపాడుతాడు. అది పరమభక్తుల జీవనశైలి అని నిజభక్తులు తేలికగా గ్రహిస్తారు. ఇది సత్యం-సత్యం-సత్యం. కాని ఎంత నీచమైనది ఈ మనస్సు ఎంత దుర్బుద్ధిగలది. గురువే ఆప్తమిత్రుడని ఎరుగనియ్యదు కదా! సద్గురువు కురిపించే దయను ఆసరాగా తీసుకొని అంతరంగంలోకి వెళ్లాలి. శ్రీనాన్నగారు "మూడునెలల పసిపాపను తల్లి ఎలా చూచుకొంటుందో గురుప్రేమ అలా ఉంటుంది" అన్నారు. అంటే బిడ్డకు ఎప్పడు పాలు ఇయ్యాలి, ఎప్పడు స్నానం చేయించాలి ఎప్పడు నిద్రపుచ్చాలి అని ప్రేమతో విశ్వమనస్సుతో మనలను నిరంతరం పరివేక్షిస్తూ, పోషిస్తూ ఉంటారు. వాసనలు పోవటనికి శిక్షించే తండ్రిలాగా తిరిగి లాలించే తల్లిలా ఆయన ఒడిలో సుఖంగా జీవిస్తాడు. నిజభక్తులు మాత్రమే ఈ సూక్ష్మవిషయాన్ని నరనరాల్లో జీర్ణించుకొంటారు. గురుస్మరణపై ఎక్కువ శ్రద్ధవహిస్తే ఏకాగ్రత ఎంతవరకూ ఉన్నది తెలుస్తుంది. పరంధామం నుంచి ఆజ్ఞతో పిలుపు వచ్చివారి ధ్యాసే అంతరంగంలోకి వెళుతుంది. వారికే సత్యం ప్రాప్తమౌతుంది. ఇది అంతా మన చేతుల్లో లేదు. పరమాత్మ ఆజ్ఞ అయినప్పడే సద్గురువుతో సన్నిహిత సంబంధమేర్పడు తుంది. అప్పడు మన సాధనామార్గం మరుమల్లెబాటయై గమ్యాన్ని చేరుతాము గురురుణం ఎన్నటికీ తీరదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**